క్లుప్తంగా

కార్తిక దీపారాధన

మోపిదేవి: కార్తిక మాసం సందర్భంగా మండలంలోని శైవ క్షేత్రాల్లో మహిళలు దీపారాధనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో శనివారం ఉదయం దీపారాధన చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారు జాము నుంచే దీపారాధనలు చేశారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధర రావు ఆధ్వర్యంలో ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రగ్బీ పోటీలకు ఎంపిక

పెడన: పెడనలోని తోటమూల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అండర్–19 రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న విజయవాడ స్టెల్లా కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి అండర్–19 రగ్బీ పోటీలకు 9వ తరగతి విద్యార్థులు వల్లభ చరణ్, దాసరి సాగర్ కృష్ణా జిల్లా జట్టుకు, అండర్–17 విభాగంలో విద్యార్థి బొడ్డు పండు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి కృష్ణా జట్టుకు ఎంపికయ్యారని చెప్పారు. వీరు సోమవారం నుంచి కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

త్రోబాల్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

కృత్తివెన్ను: రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు కృత్తివెన్ను మండలం రాళ్ళరేవు ఉన్నత పాఠశాల విద్యార్థి బండ్రెడ్డి సాయిరాం ఎంపికయ్యాడని హెచ్ఎం చంద్రమోహన్ తెలిపారు. ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి త్రోబాల్ ఎంపిక పోటీల్లో సాయిరాం అండర్–14 విభాగంలో ప్రతిభ చూపాడని చెప్పారు. సాయిరాంను అభినందించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

బంటుమిల్లి: మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) వద్ద శనివారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, ఏఓ శివరామకృష్ణ తెలిపారు. అన్ని కేంద్రాల వద్ద సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోళ్లు చేస్తామని వివరించారు.

చట్టాలపై అవగాహన

చిలకలపూడి(మచిలీపట్నం): హక్కులు, చట్టాలపై గిరిజనులు అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చింతగుంటపాలెం గిరిజన కాలనీలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ పలు చట్టాలను వివరించారు. ఉచిత న్యాయ సహాయాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి ఎం. ఫణిదూర్జటి మాట్లాడుతూ గిరిజనులంతా విద్యాపరంగా, ఆర్థిక పరంగా పురోగతి సాధించాలన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

మేయర్ వెంకటేశ్వరమ్మ


మొక్క నాటుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి వాటిని సంరక్షించాలని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. మొక్కల పెంపకంతో కాలుష్య రహిత సమాజం ఏర్పడుతుందని చెప్పారు. నగరంలోని మూడు స్తంభాల సెంటర్ నుంచి బైపాస్ రోడ్డులోని డివైడర్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు తమ పాలకవర్గం కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగానే మూడు స్తంభాల సెంటర్ నుంచి పెడన రోడ్డులోని మాచవరం మసీదు వరకు సెంటర్ డివైడర్‌లో రూ. 33.26 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. పర్యావరణ హితం కోసం నగర పాలక సంస్థ చేపట్టిన కార్యక్రమానికి ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, కమిషనర్ జి. చంద్రయ్య, కార్పొరేటర్లు మాచవరపు రాం ప్రసాద్, కట్టా కేదారేశ్వరరావు, మేకల సుబ్బన్న, షేక్ ముంతాజ్‌బేగం, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వీఏఎస్ మూర్తి, పార్టీ నాయకుడు ధనికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాండురంగస్వామి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

మచిలీపట్నంటౌన్: ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్న చిలకలపూడి పాండురంగ స్వామి ఉత్సవాల ఏర్పాట్లను నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ శనివారం పరిశీలించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసే సౌకర్యాలతో పాటు విద్యుత్ దీపాలంకరణ వంటి పనులపై డీఈలు వర ప్రసాద్, సతీష్‌చంద్రలను అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రాంగణంతో పాటు చిలకలపూడిలోని పలు ప్రాంతాలను ఆమె పరిశీలించి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

- పేర్ని కిట్టు
- అసైన్డ్ భూములకు పట్టాలు అందజేత


పేదలకు పట్టాలు అందజేస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. బందరు మండలం పెదపట్నం గ్రామంలోని నిరుపేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాలను శనివారం పేర్ని కిట్టు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ ప్రతి పేద వాడు గొప్పింటి వాడు కావాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. అలాగే ప్రతి ఒక్కరు సొంత భూములు కలిగి ఉండాలన్నదే ఆయన ఆశయమని చెప్పారు. ఆయన ఆశయానికి తగ్గట్టుగా అర్హులైన పేదలందరికీ భూములను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. మార్కెట్ యార్డు చైర్మన్ గాడెల్లి డేవిడ్ మాట్లాడుతూ మాట తప్పని, మడమ తిప్పని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఆయన లాంటి గొప్ప నాయకుడు మన రాష్ట్రానికి ఉండటం అదృష్టంగా ప్రతి ఒక్కరు భావించాలన్నారు. రానున్న ఎన్నికల్లోనూ మనమంతా ముఖ్యమంత్రికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, కేడీసీసీబీ డైరెక్టర్ గడిదేశి బాలజేసు, పెదపట్నం సర్పంచ్ గడిదేశి అనూష, ఇన్‌చార్జి రాజు, మాజీ సర్పంచ్ ఇంతేటి మరియన్న, ఆర్ఐ యాకూబ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మిగులు బడ్జెట్‌కు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన: పెడన పురపాలక సంఘంలో 2023–23 ఏడాదికి సవరించిన బడ్జెట్‌ను, 2024–25 ఏడాదికి అంచనాల బడ్జెట్‌ను ప్రత్యేక సమావేశంలో కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. శనివారం ఉదయం పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన కౌన్సిల్ ప్రత్యేక, అత్యవసర సమావేశాలు జరిగాయి. తొలుత ప్రత్యేక సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ 2023–24 ఏడాదికి సంబంధించి సవరించిన బడ్జెట్ ప్రకారం వచ్చిన ఆదాయంలో (ఖర్చులు) వ్యయం పోను 2024–25 ఏడాదికి అంచనాల బడ్జెట్‌లో మిగులు బడ్జెట్ రూ.5.15 కోట్లు ఉందన్నారు. 9వ వార్డు కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు మాట్లాడుతూ ఆదాయ మార్గాలను అన్వేషించి మున్సిపల్ ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ పలు సూచనలు చేశారు. అనంతరం అత్యవసర సమావేశంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ మహేంద్ర, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

30 వేల గన్నీ బ్యాగులు సిద్ధం

మోపిదేవి: మండలంలో వరి కోతలకు ముందుగానే గన్నీ (గోనే) సంచులు సిద్ధం చేశామని మండల వ్యవసాయాధికారి హెబ్సిబా రాణి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 12 ఆర్‌బీకేల వద్ద ధాన్యం కొనుగోలుకు గన్నీ బ్యాగులు సిద్ధం చేశామని తెలిపారు. ఆర్‌బీకే పరిధిల్లో విస్తీర్ణాన్ని బట్టి బ్యాగులు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఇప్పటి వరకు 30 వేలకు పైగా గన్నీ బ్యాగులు ఆయా ఆర్‌బీకేలకు తరలించామన్నారు. వరి కోతలు కోసే ఈ క్రాప్ చేయించుకున్న రైతులు ముందస్తుగా ఆయా ఆర్‌బీకేలలో సంప్రదించాలని సూచించారు.

కాలనీ వాసులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లను అందజేస్తున్న వెంకట్రావు

మచిలీపట్నంటౌన్: బ్యాంకింగ్ చరిత్రలో మచిలీపట్నానికి ప్రత్యేక స్థానం ఉందని యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ కె. వెంకట్రావు అన్నారు. ఆంధ్రా బ్యాంక్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం 22వ డివిజన్ దేవునితోట యానాదుల కాలనీ వాసులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకట్రావు మాట్లాడుతూ ఆంధ్రా బ్యాంక్ నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు, ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు కొల్లు సాయిమోహనరావు, మదర్ థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు పైడిపాముల గురుప్రసాద్, బాలాజీ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఫిష్ ఆంధ్ర యూనిట్ ప్రారంభం

కోడూరు: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా కోడూరు పాత రామకృష్ణ థియేటర్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర సూపర్ యూనిట్‌ను ఆదివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభిస్తామని ఎఫ్‌డీఓ వానపల్లి సత్యనారాయణ శనివారం తెలిపారు. పథకం ద్వారా యూనిట్ ఏర్పాటుకు రూ.13 లక్షలు కేటాయించగా, ఇందులో ప్రభుత్వం 40 శాతం సబ్సిడీని అందించిందని చెప్పారు. యూనిట్ ఏర్పాటు చేసిన లబ్ధిదారుడికి రూ.5.20 లక్షల సబ్సిడీ వస్తుందన్నారు.

విద్యార్థినిపై బ్లేడ్‌తో దాడి

పెడన: పట్టణంలోని బీజీకే జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం ఓ విద్యార్థినిపై అదే తరగతికి చెందిన మరో విద్యార్థి బ్లేడ్‌తో దాడి చేశాడు. శనివారం మధ్యాహ్నం తరగతి గదిలో దాడికి పాల్పడిన విద్యార్థి పక్కనే ఉన్న మరో విద్యార్థినిని పిలవాల్సిందిగా కోరాడు. సదరు విద్యార్థిని పిలవలేదు. ఆగ్రహించిన విద్యార్థి బ్లేడ్ తీసుకుని విద్యార్థిని కుడిచేతిని గాయపరిచాడు. ఘటనపై పెడన ఎస్ఐ రవిచంద్రకుమార్ మాట్లాడుతూ బాధిత విద్యార్థిని తల్లిదండ్రులు వచ్చారని, సదరు ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహిస్తున్నామని చెప్పారు.

నూతన పాలకవర్గం ఎన్నిక

నాగాయలంక: మహిళా సమాఖ్య దివిసీమ మండల నూతన పాలకవర్గం ఎన్నికైంది. అధ్యక్షురాలిగా మర్రిపాలెం గ్రామ సమాఖ్య ప్రెసిడెంట్ మద్ది మల్లేశ్వరి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా రేమాలవారిపాలెం వీఓ ప్రెసిడెంట్ ఆర్.దుర్గా ప్రసన్న, కోశాధికారిగా బి.లక్ష్మీకుమారి, ఉపాధ్యక్షురాలిగా ఎ.బాలాజీ, జాయింట్ సెక్రటరీగా ఎస్.అన్నపూర్ణలతో కార్యనిర్వాహక కమిటీ ఎన్నికైంది. 43 గ్రామ సమాఖ్యల ప్రెసిడెంట్లు సభ్యులుగా కొనసాగుతారు. నూతన పాలకవర్గం ఏడాది కాలం పనిచేస్తుంది.

రూ.4.5 కోట్లతో అంతర్గత రహదారుల అభివృద్ధి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సత్యనారాయణ

కోడూరు: మండలంలో ఏడాది వ్యవధిలో రూ.4.5 కోట్లతో అంతర్గత రహదారులను అభివృద్ధి చేశామని జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ అన్నారు. శనివారం ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.2 కోట్లు, ఏపీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రూ.కోటి, జిల్లా పరిషత్ ద్వారా రూ. కోటి, ఎంపీ గ్రాంట్ ద్వారా రూ.50 లక్షలతో నూతన సీసీ రహదారులను నిర్మించామని జెడ్పీటీసీ చెప్పారు. వీటితో పాటు ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.65 లక్షలు, లింగన్నకోడు మురుగు డ్రెయినేజీలపై ఉల్లిపాలెం వద్ద రూ.1.20 కోట్లు, నరసింహపురం వద్ద రూ.43 లక్షలతో వంతెన నిర్మాణానికి ఎంపీ గ్రాంట్ నుంచి నిధులు కేటాయించామని తెలిపారు. అధ్వానంగా ఉన్న కోడూరు–అవనిగడ్డ నూతన రహదారి నిర్మాణానికి రూ.16.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఆర్అండ్‌బీ ఏఈ భానుకిరణ్ తెలిపారు. మండలంలో 35 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణాలకు అనుమతులు రావాల్సి ఉందన్నారు.

వారం రోజుల్లో ఇంటింటికీ కుళాయి..

జల్ జీవన్ మిషన్‌లో భాగంలో మండలంలోని తీరప్రాంత గ్రామాలకు ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీటిని సరఫరా చేయనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్ తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని వి.కొత్తపాలెంలో రూ.12 లక్షలు, విశ్వనాథపల్లిలో రూ.10 లక్షలు, పాదాలవారిపాలెంలో రూ.10 లక్షలు, సాలెంపాలెంలో రూ.40 లక్షలతో రక్షిత మంచి నీటి పథకం ప్లాంట్లను అభివృద్ధి చేయనున్నామన్నారు. మండలంలోని 11 సచివాలయాలకు గాను ఎనిమిది సచివాలయాల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని, వీటిని త్వరలోనే ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ ఏఈ విజయకుమార్ చెప్పారు. భూమి లేని నిరుపేదలకు ఈ నెల 21న రామకృష్ణాపురంలో 125 మందికి, పిట్టల్లంకలో 83 మందికి భూ పట్టాలను పంపిణీ చేస్తామని తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా తెలిపారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖ పనితీరును వివరించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఓ నాయక్, డ్రెయినేజీ ఏఈ అబ్దుల్ కరీం, ఏపీఎం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

24 వరకు సామాజిక తనిఖీలు

నాగాయలంక: మండలంలో 2022–23 ఆర్థిక సవంత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు ఈనెల 24వ తేదీ వరకు జరుగుతాయని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ రవికుమార్ శనివారం తెలిపారు. మండలంలో ఉపాధి హామీ కింద రూ.9.42 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.2.27 కోట్ల విలువైన పనులు జరిగాయన్నారు. సామాజిక తనిఖీలలో భాగంగా ప్రత్యేక బృందాలు మండలంలో పర్యటించి వివరాలు సేకరిస్తారని చెప్పారు.

కులగణన సర్వేపై అవగాహన..

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణన సర్వే 2023పై శనివారం డీడీఓలు, గ్రేడ్–5 కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈఓ అన్నపరెడ్డి రామారావు, హాస్టల్ వెల్ఫేర్ అధికారి వనజాక్షి, కార్యాలయ సూపరింటెండెంట్ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మచిలీపట్నంటౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు 33వ డివిజన్‌లో ప్రారంభమవుతుందని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతచెట్టు సెంటర్ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

కులగణన పకడ్బందీగా నిర్వహించాలి

గూడూరు: కులగణనను పకడ్బందీగా నిర్వహించాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. గూడూరులోని వెలుగు కార్యాలయంలో కులగణనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా సిబ్బంది వ్యవహరించాలన్నారు. కులగణనలో ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, సర్పంచి లింగం సులోచనారాణి, కో–ఆప్షన్ సభ్యుడు కరీముల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, బత్తిన నాగత్రినాథ్, లింగం విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలి


కోడూరులో రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

కోడూరు: విద్యార్థులు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కోడూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులకు స్థానిక గ్రంథాలయంలో లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ పోటీలు జరిగాయి. బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించిన రన్నింగ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ముగింపు సభలో బహుమతులను అందిస్తామని గ్రంథాలయ అధికారి పుష్పలత తెలిపారు. ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

చిత్రలేఖనం పోటీలు..

గూడూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం గూడూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు తెలిపారు. తొలుత గ్రంథాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి సీహెచ్‌సీ డైరెక్టర్లు బత్తిన త్రినాథ్, ఎంఏ సలీమ్‌లు పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ బషీర్, గోపి మాస్టారు, రాము, నాగలక్ష్మి, భవాని, వీరబాబు, కోదండరాము పాల్గొన్నారు.

అలరించిన దేశభక్తి గీతాలాపన

మచిలీపట్నంటౌన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో దేశభక్తి గీతాలాపన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఆలపించిన దేశ భక్తి గీతాలు అలరించాయి. సింగరాజు కల్యాణి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. అనంతరం తెలుగు భాషా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో బాల బంధు బీవీ నరసింహారావు సాహిత్యం, జీవితం అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

చల్లపల్లి: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం స్థానిక గ్రంథాలయంలో సాంస్కృతిక ప్రదర్శన పోటీలు నిర్వహించారు. నృత్య కళాకారిణులైన బాలికలు ఎల్.స్నేహిత, జలజ విజేతలుగా నిలిచారు. లైబ్రేరియన్ కె.గణేష్ కుమార్ పర్యవేక్షించారు.

చిత్రలేఖనం, క్విజ్ పోటీలు

రావివారిపాలెం(మోపిదేవి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రాథమిక, జెడ్పీపాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి కె. సుధీర్‌కుమార్ పర్యవేక్షించారు.

బాబా ఫరీద్ దర్గా సేవకుడు అప్పారావు మృతి



కోనేరుసెంటర్: బందరు మండలం పెదకరగ్రహారం బాబా ఫరీద్ దర్గా ప్రధాన సేవకుడు నాదేపల్లి అప్పారావు శనివారం మృతిచెందారు. విజయనగరం దిబ్బలపాడు గ్రామానికి చెందిన నాదేపల్లి అప్పారావు ఏడేళ్ల వయస్సులోనే బాబా పట్ల ఆకర్షితులై ఆయన సేవకు అంకితమయ్యారు. అప్పటి నుంచి దాదాపు 70 ఏళ్లుగా అప్పారావు దర్గాకు సేవలు అందిస్తున్నారు. పెద్దాయ్యాక దర్గా ప్రధాన సేవకునిగా మారి దర్గాను నడిపిస్తూ వచ్చారు. అప్పారావు తన పేరు కంటే బాబాగానే భక్తులకు పరిచయస్తులుగా మారగా ఆయన్ని అందరూ బాబా అంటూ సంబోధించేవారు. ఏడు దశాబ్దాలపాటు దర్గాలో ఉంటూ బాబాకు సేవలు చేసిన అప్పారావు అకాల మరణాన్ని తెలుసుకున్న భక్తులు దర్గాలో ఉంచిన ఆయన మృతదేహాన్ని సందర్శించారు. ఆదివారం అప్పారావు భౌతికకాయానికి అంత్యక్రియలు జరుగుతాయని దర్గా కమిటీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ శాంతి ఫరీద్ తెలిపారు.

నాడు–నేడు పనులు వేగవంతం చేయండి

మోపిదేవి: మన బడి నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఏఈ తోట అజయ్ అన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో శనివారం రెండో విడత నాడు–నేడు పనుల అభివృద్ధిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాడు–నేడు రెండో విడతలో రూ. 5,86,31,000 ఎస్టిమేట్స్‌తో పనులు చేపట్టగా ఇప్పటివరకు రూ. 1,85,93,000 విడుదల అయ్యాయన్నారు. రూ. 1,85,41,000 వెచ్చించగా, మరో రూ. 52 వేలు మిగిలి ఉన్నాయని చెప్పారు. అభివృద్ధి పనులపై ఓచర్స్, చెక్ ఇష్యూ రిజిస్టర్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. కె. కొత్తపాలెం జెడ్పీ పాఠశాల అభివృద్ధిలో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ చేయాల్సి ఉంటుందన్నారు. ఎంఈఓ–1 విద్యాసాగర్, ఎంఈఓ–2 రాజ్‌కుమార్, పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్పీలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ మృతి

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ దోనేపూడి వీరరాఘవేంద్రరావు (68) అలియాస్ పీసుబాబు శనివారం మృతిచెందారు. ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, పలువురు ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

స్వామివారికి రుద్రాభిషేకం

కోనేరుసెంటర్: ఎస్ఎన్ గొల్లపాలెంలోని సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

గూడూరు: అవినాష్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యుడు మోటేపల్లి రత్నారావు, ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.